గండిపేట మండలంలో హైడ్రా కమిషనర్ పర్యటన



మార్నింగ్ రాగ గేటెడ్ కమ్యూనిటీని పరిశీలిస్తున్న ఏవీ రంగనాథ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గండిపేట మండలంలోని మణికొండ మున్సిపాలిటీ, అల్కాపురి టౌన్‌షిప్‌లో అనుహార్ హోమ్స్ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన మార్నింగ్ రాగ గేటెడ్ కమ్యూనిటీని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం సందర్శించారు. రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని మార్నింగ్ రాగ గేటెడ్ కమ్యూనిటీలో కమర్షియల్ వినియోగాలు నిర్వహిస్తున్నారని స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్రమ నిర్మాణాలు, వినియోగంపై తెలంగాణ మున్సిపల్ యాక్ట్ సెక్షన్ 178(2) ప్రకారం హైడ్రాకు సమకూరిన అధికారాల మేరకు తనిఖీలు నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కమిషనర్, నిర్వాసితులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను విచారించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ అనుమతులు తీసుకున్న ప్రకారమే నిర్మాణాన్ని ఉంచాలని, ఎలాంటి వ్యాపార లావాదేవీలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రౌండ్ ఫ్లోర్‌ను కమర్షియల్‌గా మార్చినందున నిర్మాణ సామర్థ్యం సరిపోదని, అనుమతుల మేరకే వినియోగం ఉండాలని నిర్మాణదారులకు సూచించారు. అనుహార్ హోమ్స్ నిర్మాణ సంస్థ అనుమతుల పత్రాలను మరోసారి పరిశీలించి చర్యలు చేపట్టాలన్నారు. కాగా, రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని కమర్షియల్‌గా మార్చడాన్ని తాము ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని పలువురు నిర్వాసితులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

మంచిరేవుల దగ్గర మూసీ పరిశీలన

మంచిరేవుల దగ్గర మూసీని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. నది పరీవాహకంలో మట్టిపోసిన నిర్మాణ సంస్థలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీలో పోసిన మట్టిని వెంటనే తొలగించాలని ఆదిత్య, ఎన్‌సీసీ, రాజపుష్ప నిర్మాణ సంస్థలకు ఆదేశాలు జారీ చేశారు.

కబ్జాదారుల భరతం పట్టేందుకే హైడ్రా



కేపీహెచ్‌బీలో మాట్లాడుతున్న సత్యం శ్రీరంగం

కేపీహెచ్‌బీకాలనీ/బాలానగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చెరువులు, ప్రభుత్వ స్థలాలు, రోడ్లు, మైదానాలు కబ్జా చేశారని టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం ఆరోపించారు. కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపులో శనివారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన ఉత్సవాల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కబ్జా దారుల కోసమే హైడ్రా అని, అవినీతి, కబ్జాలు ఎక్కడ బయటకు తీస్తామేమోనని అధికార పార్టీపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి కో ఆర్డినేటర్ తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాలువ సుజాత, నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, డివిజన్ నాయకులు హరివర్ధన్‌రెడ్డి, శేరి సతీష్‌రెడ్డి, కొప్పిశెట్టి దినేష్‌కుమార్, ఫణికుమార్, తమ్మినేని ప్రవీణ్‌కుమార్, సాధుప్రతాప్‌రెడ్డి, దొడ్డి రంగస్వామి, పొడుగు అప్పారావు, గంధం రాజు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారు



ఇందిరానగర్‌లో పర్యటిస్తున్న నాయకులు యుగంధర్‌రెడ్డి, మధుగౌడ్, లక్ష్మయ్య

బాలానగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని కూకట్‌పల్లి ఏబ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు మధుగౌడ్‌తో కలిసి ఇందిరానగర్, ఎన్‌టీఆర్‌నగర్, శ్రీశ్రీనగర్ ప్రాంతాల్లో పర్యటించి అక్కడి ప్రజలను కలిసి కాంగ్రెస్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ... పదేళ్ల పాలనలో ఒక్కసారైనా బస్తీ దవాఖానాల వైపు కన్నెత్తి చూడని ఎమ్మెల్యే కృష్ణారావుకు బస్తీ దవాఖానాలపై ఎందుకు అంత ప్రేమ పుట్టుకొచ్చిందో అర్థకావడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఓల్డుబోయినపల్లి మోడల్ మార్కెట్ ఎందుకు అభివృద్ధి చేయలేదన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లక్ష్మయ్య, ఫిషరీస్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల నరేందర్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గజానందర్ శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహంపై బీఆర్‌ఎస్ నేతల రాద్ధాంతం సరికాదు



నాగిరెడ్డి

ఫతేనగర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి విగ్రహంపై బీఆర్‌ఎస్ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, ఇది మంచిదని కాంగ్రెస్ కూకట్‌పల్లి ఏ బ్లాకు అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి హితవుపలికారు. బీఆర్‌ఎస్ రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రజలందరూ కొలిచారని, అదే విధంగా కొద్ది మార్పులతో సొంత తల్లిని చూస్తున్న అనుభూతిని కల్గించేలా రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహం తెలంగా ణ బిడ్డలందరికీ తప్పక నచ్చుతుందని, తన ధీమాను వ్యక్తం చేశారు. తెలంగాణ కల ఉట్టిపడేలా తెలంగాణ విగ్రహాన్ని రూపకల్పన చేసిన శిల్పి రమణారెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, సహచర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలియజేశారు.

సబ్బండ వర్గాల ఆకాంక్షలకు అద్దం పడుతోంది



ఆర్. రమాదేవి

బాలానగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సచివాలయంలో ఈనెల 9న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్న తెలంగాణ తల్లి విగ్రహం సబ్బండ వర్గా ల ఆకాంక్షలకు అనుగుణంగా రూపుదిద్దబడిందని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఏబ్లాక్ మహిళా అధ్యక్షురాలు ఆర్. రమాదేవి అన్నారు. ఆకుపచ్చని చీరలో 17అడుగుల ఎత్తున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని చూడగానే మన తల్లిని చూసిన అనుభూతి కలుగుతోందని ఆనందం వ్యక్తం చేశారు. బంగారపు రంగు అంచుతో ఉన్న ఆకుపచ్చ చీర, రెండు చేతులకు ఎరుపు, ఆకుపచ్చ మట్టి గాజులు, ఎడమ చేతిలో వరి, జొన్న, మొక్కజొన్న సజ్జ కంకులు, కాళ్లకు మెట్టెలు, పట్టీలు, మెడలో బంగారపు గొలుసులు నుదుట రూపాయంత సైజులో ఎర్రటి బొట్టుతో నిండైన గ్రామీణ రూపంలో తెలంగాణ తల్లి విగ్రహం ఉందని ఆమె అన్నారు.

'లులు' బ్యూటీలు



కేపీహెచ్‌బీలోని లులు మాల్‌లో శనివారం రాత్రి నిర్వహించిన లులు బ్యూటీ ఫెస్ట్ ఫైనల్స్‌లో మోడల్స్ సందడి చేశారు. యువతీ, యువకులు ఫొటోలకు ఫోజులిస్తూ సౌందర్యంపై తమకు ఉన్న ఆసక్తిని తెలయజేశారు.

- కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి)

16 ఏళ్లు.. 18 శిఖరాలు

- 4.982 మీటర్ల ఎత్తైన మౌంట్ విన్సన్ మాసిప్ఫ్ శిఖరంపైకి ఎక్కి రికార్డు
- మన్ననలు పొందుతున్న విశ్వనాథ్ కార్తికేయ





గ్రాండ్ పేరెంట్స్‌తో విశ్వనాథ్, తల్లి తండ్రులు రాజేంద్రప్రసాద్, లక్ష్మి, సోదరి వైష్ణవి విశ్వనాథ్

బాలానగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): 16 ఏళ్ల ప్రాయంలో అంటార్కిటికా ఖండంలోని 4.982 మీటర్ల ఎత్తున్న మౌంట్ విన్సన్ మాసిప్ఫ్ శిఖరాన్ని అధిరోహించి తెలంగాణ సత్తా చాటాడు బాలానగర్ ఫిరోజ్‌గూడకు చెందిన పడకండి విశ్వనాథ్ కార్తికేయ. ఇప్పటికే 7 ఖండాలు 18 శిఖరాలను అధిరోహించి రికార్డు సృష్టించాడు. ప్రముఖ పర్వతారోహకులు రోమిల్, తమ్మినేని భరత్ సారథ్యంలో 10 రోజుల్లో మౌంట్ విన్సన్ మాసిప్ఫ్ శిఖరాన్ని అధిరోహించి ఔరా అనిపించాడు. ప్రస్తుతం సుచిత్రా ఏరియాలో ఉన్న రెజొనెన్స్ కాలేజీలో 11వ స్టాండర్డ్ చదువుతున్న విశ్వనాథ్ రానున్న జనవరిలో సౌత్ ఆఫ్రికాలోని అకన్ కాంగ్వా, మే నెలలో ఆసియాలోని మౌంట్ ఎవరెస్టును అధిరోహించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నాడు.

విశ్వనాథ్ అధిరోహించిన శిఖరాలు ఇవే

విశ్వనాథ్ ఇప్పటి వరకు 7 ఖండాల్లో ఉన్న శిఖరాలను అధిరోహించాడు. నార్త్ అమెరికాలోని డెనాలి, యూరప్‌లోని ఎల్‌బ్రస్, ఆఫ్రికాలోని కోసీజ్‌కో, ఇండియాలోని కాంగ్‌ఎటేసీ 1,2, ఫ్రెండ్‌షిప్ పీక్, నేపాల్‌లోని ఐస్‌ల్యాండ్‌పీక్ సౌత్ ఆఫ్రికాలోని ఎత్తైన శిఖరం మౌంట్ కిల్‌మంజారో, తాజాగా అంటార్కిటికాలోని విన్సన్ మాసిఫ్‌ను అధిరోహించడం విశేషం.

విశ్వనాథ్‌కు తాత ఇచ్చిన ప్రోత్సాహమే..

వివిధ ఖండాలలోని శిఖరాలు అధిరోహించడానికి తాత పడకంటి శివకుమార్ ఇచ్చిన చేయూత వెలకట్టలేనిదని విశ్వనాథ్ పేర్కొన్నారు. తాతతో పాటు తండ్రి రాజేంద్ర ప్రసాద్, తల్లి లక్ష్మి , సోదరి వైష్ణవి, ఓల్డుబోయినపల్లిలోని సెయింట్ పీటర్ స్కూల్ ప్రిన్సిపాల్ సువర్ణ ప్రోత్సాహం మరువలేనిదని విశ్వనాథ్ కార్తికేయ చెబుతున్నాడు. శిఖరాలను అధిరోహించడానికి తనకు ఆత్మబలాన్ని, తనలో మనోనిబ్బరాన్ని నింపిన మెంటర్స్ రోమిల్, భరత్‌కు ఆజన్మాంతతం రుణపడి ఉంటానని తన ఆనందాన్ని వెలిబుచ్చాడు.



అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్ మాసిప్ఫ్ శిఖరం అధిరోహించిన విశ్వనాథ్



పర్వతారోహితులు రోమిల్, తమ్మినేని భరత్‌తో విశ్వనాథ్

విశ్వనాథ్ విజయాలపై గర్విస్తున్నాను



ప్రపంచంలోని అత్యున్నత పర్వత శిఖరాలను అధిరోహించడంలో విశ్వనాథ్ కార్తికేయ కఠోర శ్రమ కుటుంబ విలువలు, విద్యా పరమైన కట్టుబాటును సమన్వయ పరచడంపై అతడికి ఉన్న ప్రత్యేకతను చాటుతోంది. వినమ్రంగా ఉంటూ తన విజయాలను దేశానికి అందిస్తూ జాతీయ రక్షణాధికారి అవ్వాలన్న తన లక్ష్యాన్ని, అతడు సాధిస్తున్న విజయాలను చూసి ప్రిన్సిపల్‌గా గర్వపడుతున్నాను.

- సువర్ణ, ప్రిన్సిపల్, సెయింట్ పీటర్ స్కూల్, ఓల్డుబోయినపల్లి

విశ్వనాథ్ తాతకి రుణపడి ఉంటాం



విశ్వనాథ్ కార్తికేయలాంటి కొడుకును కన్నందుకు నాకెంతో గర్వంగా ఉంది. విశ్వనాథ్‌లోని క్రమశిక్షణ, కఠోర శ్రమ తనను ఈ స్థాయిలో నిలబెట్టాయి. నా కొడుకు ఇంతటి విజయాన్ని సాధించడానికి విశ్వనాథ్ తాత చేయూత సహకారం మరువలేనిది. ఆజన్మాంతం మేమంతా ఆయనకు రుణపడి ఉంటాం. నా కొడుకు మరిన్ని శిఖరాలు అధిరోహించి దేశం, రాష్ట్రం గర్వపడేలా నా కొడుకును కాపాడాలని భగంతుడిని ప్రార్థిస్తున్నాను.

- లక్ష్మి, తల్లి

వెలమ కులస్థులపై ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు వినతిపత్రం ఇస్తున్న వెలమ సంఘం నాయకులు

హైదర్‌నగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వెలమ కులస్థులపై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్ మాట్లాడిన తీరును కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఖండిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఓ కులాన్ని కించపరుస్తూ మాట్లాడడం శంకర్‌కు సబబుకాదని, ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ మాట్లాడించినట్టే ఉందని, దీనికి పార్టీ బాధ్యత వహిస్తుందాని ప్రశ్నించారు. అన్ని కులాల వారు ఓట్లు వేస్తేనే ఎమ్మెల్యేగా శంకర్ గెలిచాడని, ఆయన తన అహంకార దోరణి మార్చుకోవాలని హెచ్చరించారు. రాష్ట్రంలో కులాల మధ్య చిచ్చు పెట్టేలా కాంగ్రెస్ వ్యవహరిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ తీరు మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోందని హెచ్చరించారు. అనంతరం వెలమ సంఘం సభ్యులు నాగరాజు, సతీష్ రావు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి వీధుల్లో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. సంఘం సభ్యులు ర్యాలీగా వెళ్లి కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో కిలో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.29, వంకాయ రూ.28, బెండకాయ రూ.28, పచ్చి మిర్చి రూ.33, బజ్జీ మిర్చి రూ.35, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.38, క్యాబేజీ రూ.19, బీన్స్ రూ.35, క్యారెట్ రూ.47, గోబి పువ్వు రూ.18, దొండకాయ రూ.28, చిక్కుడు కాయ రూ.45, గోరు చిక్కుడు రూ.23, బీట్‌రూట్ రూ.40, క్యాప్సికం రూ.55, ఆలుగడ్డ రూ.36, కీర రూ.25, దోసకాయ రూ.18, సొరకాయ రూ.20, పొట్లకాయ రూ.20, కంద రూ.55, ఉల్లిపొరక రూ.40, ఉల్లిగడ్డ రూ.49, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.35, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.30, గుమ్మడికాయ రూ.40, నిమ్మకాయలు రూ.30-40, మునగ కాయలు రూ.18-20, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.220, అల్లం రూ.160, వెల్లుల్లి రూ.400, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.60, కరివేపాకు రూ.100, పర్వల్ రూ.40, పల్లికాయ రూ.65, లోబా రూ.30, ఆ కాకరకాయ రూ.95. పైన పేర్కొన్న ధరలు ఆదివారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు మధుమేహంపై అవగాహన

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వసంతనగర్ రోడ్డు నంబర్-2లోని మాధవ్‌బాగ్ క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం మధుమేహంపై అవగాహన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. మధుమేహ రోగులతో పాటు సాధారణ ప్రజలు కూడా తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు.

మరమ్మతు పనుల పరిశీలన

అల్లాపూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీవివేకానంద నగర్, బ్యాంక్ కాలనీలో జరుగుతున్న విద్యుత్ లైన్ల పనులు, మరమ్మతు పనులను శనివారం అల్లాపూర్ కార్పొరేటర్ సబీహ బేగం పరిశీలించారు. నేషనల్ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీ నుంచి శ్రీవివేకానంద నగర్, అయ్యప్ప సొసైటీ నుంచి పర్వత్ నగర్ ఫీడర్లను కలుపుకొంటూ 16 స్తంభాలను అనుసంధానం చేస్తూ నూతన లైన్లు వేస్తున్నట్టు కార్పొరేటర్ చెప్పారు. ఈ అనుసంధానంతో పర్వత్ నగర్ ప్రస్తుత లైన్‌కు లోడ్ భారం తగ్గి మెరుగైన విద్యుత్ సరఫరా వీలవుతుందన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదర్‌నగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో నోవా ఈఎన్‌టీ సౌజన్యంతో బీఆర్‌ఎస్ వింగ్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శనివారం ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో నిరుపేద పిల్లలకు అండగా నిలిచి నోవా ఈఎన్‌టీ ఆస్పత్రి డాక్టర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమం చేయడం అభినందనీయమన్నారు. ఈ చికిత్స కార్యక్రమంలో విద్యార్థులకు పరీక్షలు చేసిన తర్వాత ఎలాంటి అవసరాలు ఉన్నా వారిని ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఏంఈఓ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్, బీఆర్‌ఎస్ యూత్ వింగ్ చైతన్య యాదవ్, సంతోష్‌యాదవ్, మహేష్, లోకేష్, అఖిల్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్ల పంపిణీ

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో శనివారం కూకట్‌పల్లి ఐడీఎల్ ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్యాటరీ సైకిళ్లను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షులు వేల్పుగొండ వెంకటస్వామి, కార్పొరేటర్ రవీందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మంద కృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

పంజాగుట్ట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విమర్శించారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చేయూత పెన్షన్ దారుల సమస్యలపై అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ.. ఏడాది పాలన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు చేసుకుంటుందని, అయితే దివ్యాంగులు మాత్రం ఆవేదనతో కూడిన సమావేశం నిర్వహించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వికలాంగుల చట్టాన్ని రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఓ ఐఏఎస్ అధికారిని దివ్యాంగులను అవమానించినా ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఎన్నికల్లో దివ్యాంగులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఏ విధంగా పోరాడామో, అదే విధంగా దివ్యాంగుల హక్కుల కోసం పోరాటం చేస్తామని మంద కృష్ణ అన్నారు. ఈ సమావేశంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకురాలు బాలలత, జాతీయ కోర్ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు, వైస్ చైర్మన్ అందె రాంబాబు, జాతీయ అధ్యక్షులు సుజాత సూర్యవంశీ, న్యూడెమోక్రసీ కార్యదర్శి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

భెల్ టౌన్‌షిప్‌లో ఆధ్యాత్మిక శోభ



భస్మార్చనలో పాల్గొన్న కార్పొరేటర్ రోజారంగారావు



పూజలో కాంగ్రెస్ రంగారెడ్డిజిల్లా ఉపాధ్యక్షురాలు విద్యాకల్పన ఏకాంత్‌గౌడ్

ఖెల్‌కాలనీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్ఠి పర్వదినం సందర్భంగా భెల్ టౌన్‌షిప్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో షష్ఠి వేడుకలు కనులపండువగా నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న మహోత్సవాల్లో భాగంగా శనివారం ప్రధాన ఉత్సవం నిర్వహించారు. ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ ఫల పంచామృతాభిషేకం, అష్టనాగ సుబ్రహ్మణ్య సహస్ర నామార్చన, రుద్రాభిషేకం తదితర విశేషపూజలు చేశారు. సాయంత్రం దేవాలయ మహామండపంలో సుందరంగా అలంకరించిన పుష్పపీఠంపై వల్లీదేవసేన ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మహోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. ఆదివారం కాలభైరవాష్టమి సందర్భంగా కాలభైరవస్వామి దేవాలయంలో విశేష పూజలు జరుగుతాయని అర్చకులు తెలిపారు. స్వర్ణ భైరవకు పాశపత మహారుద్రాభిషేకం, కాలసర్ప దోష శాంతి, సర్పహోమం, మహాభైరవ యంత్ర ఆరాధన తదితర విశేషపూజలు నిర్వహిస్తారని తెలిపారు. వివిధ దోషాలతో బాధడుతున్న వారు కాలభైరవ పూజల్లో పాల్గొంటే శాంతి లభిస్తుందని తెలిపారు.



విశేష పుష్పార్చనలో సుబ్రహ్మణ్య స్వామి

చైతన్యనగర్‌లో..

హైదర్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ చైతన్యనగర్‌లోని నాగదేవత గుడిలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా 108 కిలోల భస్మార్చనలో శనివారం భక్తులతో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజారంగారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానికులు నరసయ్య, బాలరాజు, నర్సింగ్ రావు, అనిల్, మల్లేష్, పవన్, కిరణ్ పాల్గొన్నారు.

● సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా నిర్వహించిన పూజల్లో కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డిజిల్లా ఉపాధ్యక్షురాలు విద్యాకల్పన ఏకాంత్‌గౌడ్, పార్టీ సెక్రటరీ సంధ్య, షాలిని, నాగమణి ప్రత్యేక పూజలు చేశారు.



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువతతో ప్రమాణం చేయిస్తున్న నాయకులు, పోలీసులు

డ్రగ్స్‌కు దూరంగా ఉంటాం

● విద్యార్థులు, యువకులతో ప్రమాణం

మియాపూర్,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలపై శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో శనివారం మియాపూర్ మదీనగూడలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, ప్రజాపాలన విజయోత్సవ సంబరాల నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, టీఎస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సతీష్, ఎంబీసీ చైర్మన్ జైపాల్, ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, కార్పొరేటర్ పూజిత ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా రూపుమాపేందుకు ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం, సారా అమ్మకాలు, రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నదని, ప్రత్యేక నిఘా పెట్టి మాదకద్రవ్యాల నియంత్రణకు కృషిచేస్తున్నదని తెలిపారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ఈసందర్భంగా అందరితోనూ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో విద్యార్థులు, స్థానిక యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదర్‌నగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో నోవా ఈఎన్‌టీ సౌజన్యంతో బీఆర్‌ఎస్ వింగ్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శనివారం ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నిరుపేద పిల్లలకు అండగా నిలిచి నోవా ఈఎన్‌టీ ఆస్పత్రి డాక్టర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమం చేయడం అభినందనీయమన్నారు. ఈ చికిత్స కార్యక్రమంలో విద్యార్థులకు పరీక్షలు చేసిన తర్వా త ఎలాంటి అవసరాలు ఉన్నా వారిని ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఏంఈఓ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్, బీఆర్‌ఎస్ యూత్ వింగ్ చైతన్యయాదవ్, సంతోష్‌యాదవ్, మహేష్, లోకేష్, అఖిల్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్ల పంపిణీ

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో శనివారం కూకట్‌పల్లి ఐడీఎల్ ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్యాటరీ సైకిళ్లను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షులు వేల్పుగొండ వెంకటస్వామి, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలు షురూ



హైదరాబాద్ (ఆంధ్ర జ్యోతి క్రీడాప్రతినిధి): గాడియం జాతీయ సబ్ జూనియర్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ శనివారం ప్రారంభించారు. ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా 750 మంది యువ క్రీడాకారులు అండర్-11, 13, 15 విభాగాల్లో పాల్గొననున్నారు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. పోటీల ప్రారంభోత్సవంలో గాడియం విద్యాసంస్థల చైర్మన్ నిత్యానంద రెడ్డి, సీఈఓ రామకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం, యోగాతో ఉత్తమ ఫలితాలు





జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మహర్షి గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల చైర్మన్ బ్రహ్మచారి డాక్టర్ గిరీష్‌జి, విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్

గచ్చిబౌలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధ్యానం, యోగా చేయడం వల్ల ఉత్తమ ఫలితాలు ఉంటాయని మహర్షి గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల చైర్మన్ బ్రహ్మచారి డాక్టర్ గిరీష్‌జీ అన్నారు. కొండాపూర్‌లోని మహర్షి విద్యామందిర్ పాఠశాల 25 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా శనివారం గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పాఠశాలలో సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన ప్రపంచస్థాయి విద్యను అందించడంలో తాము ముందుంటామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ వాసంతి వార్షిక నివేదిక అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

హైదర్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన ప్రజలు వైద్య చికిత్సనిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో వారికి మంజూరైన రూ.2.10 లక్షల చెక్కులను శనివారం ఎమ్మెల్యే గాంధీ తన కార్యాలయంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని, సీఎం సహాయ నిధి నిరంతరం సేవలు అందిస్తు ఆపదలో అండగా నిలుస్తుందన్నారు.



ఎమ్మెల్సీ కవితతో బీఆర్‌ఎస్ నాయకులు రవియాదవ్, శ్రీకాంత్

ఎమ్మెల్సీ కవితను కలిసిన శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ నాయకులు

గచ్చిబౌలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్సీ కవిత అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ బీఆర్‌ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు, శేరిలింగంపల్లి డివిజన్ బీఆర్‌ఎస్ నాయకుడు మారబోయిన రవియాదవ్, శ్రీకాంత్ తన అనుచరులతో కలిసి శనివారం ఎమ్మెల్సీ కవితను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల ముందు ప్రజలకు అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఏడాది పూర్తయినా హామీలు నేరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. శేరిలింగంపల్లిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆమె సూచించారు.

పాస్టర్లకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సతీష్‌రావు

హైదర్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ ఇంద్రహిల్స్ జెరూసలేం ప్రార్థన మందిరం రెవరెండ్ ఎం రాజు చర్చిలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్‌రావు పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాములుగౌడ్, సాయిగౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, బాలస్వామి, అజయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధిమాంద్యులకు చేయూతనందించాలి



కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఖెల్‌కాలనీ, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, బుద్ధిమాంద్యును చేరదీసి సహాయం చేయడమే నిజమైన మానవత్వమని బీహెచ్ఈఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భరణీధర్ రాజా పేర్కొన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్పెషల్ కేర్ పాఠశాల విద్యార్థులు శనివారం భెల్ టౌన్‌షిప్ ర్యాలీ శనివారం నిర్వహించారు. అందరినీ సమానంగా చూడాలని.. ప్రోత్సాహం అందించాలంటూ ఫ్ల కార్డులను చేతబట్టి, నినాదాలు చేస్తూ స్త్రీ సంక్షేమ కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతనం జరిగిన వేడుకల్లో భెల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేబీ రాజా మాట్లాడుతూ.. ఆత్మవిశ్వాసం తోడుంటే బుద్ధిమాంద్యులు అన్నీ సాధించగలరని తెలిపారు. అందరూ దివ్యాంగులు, మానసిక దివ్యాంగులకు చేయూతనివ్వాలని, వారిని ఆదరించాలన్నారు. దివ్యాంగులను ప్రోత్సహిస్తే కొలుకోవడంతో పాటు ఆయారంగంలో విజయం సాధిస్తారన్నారు. భెల్ యాజమాన్యం సీఎస్‌ఆర్ ద్వారా సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతూ దివ్యాంగులకు చేయూతనందిస్తోందన్నారు. దివ్యాంగుల హక్కులను అమలు పరుస్తూ కార్మికులతో సరిసమానంగా గౌరవిస్తున్నామని తెలిపారు. అంగవైకల్యం దేనికీ అడ్డురాదని, పట్టుదలే వారి విజయానికి నాంది అవుతుందన్నారు. అంగవైకల్యం గలవారు నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని ఇది వారిలోని ఆత్మవిశ్వాసానికి నిదర్శనమన్నారు. బుద్ధిమాంద్యుల కోసం భెల్ యాజమాన్యం రెండు ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేసి వారికి ప్రత్యేక శిక్షణనిస్తున్నారని పేర్కొన్నారు. స్త్రీ సంక్షేమ కేంద్రం అధ్యక్షురాలు శాంతిరాజా మాట్లాడుతూ.. సంక్షేమ కేంద్రం ఆధ్వర్యంలో స్పెషల్ కేర్- అభిలాష సెంటర్‌ను ఏర్పాటు, విద్యార్థులకు చదువుతో పాటు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్త్రీ సంక్షేమ కేంద్రం అధ్యక్షురాలు శాంతిరాజా, హెచ్‌ఆర్ జీఎం శ్రీనివాసరావు, వివిధ విభాగాల అధికారులు, సంక్షేమ కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడిగా నగేష్



గచ్చిబౌలి, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): కాంగ్రెస్ పార్టీ మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడిగా నగేష్ నియమితులయ్యారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ తనను డివిజన్ అధ్యక్షుడిగా నియమించినందుకు సంతోషంగా ఉందని, తనకు పదవి రావడానికి సహకరించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ రజింత్‌రెడ్డి, సీనియర్ నాయకులు జైపాల్, రఘునాథ్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వెలమ కులస్థులపై ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు



రంగారావు

హైదర్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరపల్లి శంకరయ్య వెలమ కులస్థులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ రంగారావు ఖండించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారు ఏరోజూ కులాల ప్రస్థావన తీసుకురాకుండా పరిపాలన మీద దృష్టి పెట్టారని పేర్కొన్నారు. వెంట నే శంకర్ చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకొని, వెలమ సామాజిక వర్గానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

నేడు మధుమేహంపై అవగాహన

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వసంతనగర్ రోడ్డు నంబర్-2లోని మాధవ్‌బాగ్ క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం మధుమేహంపై అవగాహన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపా రు. మధుమేహ రోగులతో పాటు సాధారణ ప్రజలు కూడా తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు.

చెరువులో దోమల నివారణ మందు పిచికారీ



చెరువులో దోమలమందు పిచికారీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. శనివారం ఆల్విన్‌కాలనీ డివిజన్ గురుగోవింద్‌సింగ్ నగర్‌లోని పరికి చెరువు పరిసర ప్రాంతాల ప్రజలు దోమల బెడద ఎక్కువగా ఉందని కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన ఆయన చెరువును పరిశీలించి ఎంటమాలజీ సిబ్బందితో కలిసి దోమల నివారణకు చెరువులో డ్రోన్‌తో దోమల మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ఇంటిని, ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త, నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాండుగౌడ్, శ్రీనివాస్, కిరణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ నిల్.. మురుగు నీరు ఫుల్!

- బాలయ్యబస్తీలో డ్రైనేజీ ఏర్పాటు ఎప్పుడో!
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

గాజులరామారం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్‌లోని బాలయ్య బస్తీలో ప్రజలకు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ఇళ్ల ముందే డ్రైనేజీ నీరు పారుతుండటంతో దోమలు, ఈగలకు ఆవాసాలుగా మారాయి. దీంతో పిల్లలు, పెద్దలు అనారోగ్యం బారిన పడి, రోగాల పాలవుతున్నారు. బస్తీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్తీలో సుమారుగా వెయ్యి కుటుంబాల వరకు నివసిస్తున్నారు. అందులో సగం వరకే బస్తీ అభివృద్ధి జరిగింది కానీ, మిగతా సగం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది.



ఇళ్ల ముందు గుంతలు తవ్వి, అందులోకి మళ్లించిన డ్రైనేజీ నీరు

ఇళ్ల ముందే మురుగు

బస్తీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇంటి యజమానులు ఇళ్ల ముందే గోతులు తవ్వి, మురుగునీరు అందులో వదలడంతో ఆ నీరు ఎక్కువై రోడ్డుపై పారుతుంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోందని బస్తీ వాసులు తెలుపుతున్నారు.

వినతి పత్రాలు ఇచ్చినా..

బస్తీలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అసోసియేషన్ సభ్యులు అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని, ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలుపుతున్నారు. ఫిర్యాదు చేసినప్పుడే అభివృద్ధి పనులకు కావాల్సిన ప్రణాళికలు రూపొందించి, పనులు చేపడతామని హామీ ఇస్తున్నారు కానీ, అటు తర్వాత మరిచిపోతున్నారని బస్తీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

రోగాల బారిన పడుతున్నాం



ఇళ్ల ముందే మురుగు నీరు ప్రవహిస్తుంది. డ్రైనేజీ పైప్‌లైన్ లేక ఇబ్బందులు పడుతున్నాం. దుర్వాసనతో చిన్న పిల్లలు రోగాలు బారిన పడుతున్నారు.

- చిన్న, స్థానికుడు

దారుణంగా ఉంది



అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. బస్తీలో సగం వరకు డ్రైనేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వచ్చిందంటే పరిస్థితి దారుణంగా ఉంది. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం.

- జయమ్మ, స్థానికురాలు

కొంపల్లిలో 80 శాతం సర్వే పూర్తి

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపల్‌లో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వే 80 శాతం పూర్తయింది. 12 వేల 2 వందల 58 ఇళ్లు ఉన్నాయి. 2 వందల ఇండ్లు వరకు మాకు సర్వే ఎందుకని తిరస్కరించారు. 4వందల 37 ఇళ్లకు తాళం వేసి ఉన్నట్టు తెలుస్తుంది. ఇందులో కొంతమంది ఊర్లలో నమోదు చేయించుకుంటామని, వివరాలు నమోదు చేయించుకోలేదు. త్వరలోనే సర్వే డేటా ఎంట్రీని పూర్తి చేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు అధికారులు తెలిపారు.



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువతతో ప్రమాణం చేయిస్తున్న నాయకులు, పోలీసులు

డ్రగ్స్‌కు దూరంగా ఉంటాం

- విద్యార్థులు, యువకులతో ప్రమాణం

మియాపూర్,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలపై శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో శనివారం మియాపూర్ మదీనగూడలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, ప్రజాపాలన విజయోత్సవ సంబరాల నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, టీఎస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సతీష్, ఎంబీసీ చైర్మన్ జైపాల్, ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, కార్పొరేటర్ పూజిత ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా రూపుమాపేందుకు ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం, సారా అమ్మకాలు, రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నదని, ప్రత్యేక నిఘా పెట్టి మాదకద్రవ్యాల నియంత్రణకు కృషిచేస్తున్నదని తెలిపారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ఈసందర్భంగా అందరితోనూ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో విద్యార్థులు, స్థానిక యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణకు భారీగా తరలిరావాలి

పేట్ బషీరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్ బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాన్ని కార్పొరేటర్ విజయ్‌శేఖర్‌గౌడ్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 9న గండిమైసమ్మ దుండిగల్ మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారన్నారు. డివిజన్ నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మహిళల పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐఎం నాయకులు

ప్రగతినగర్‌లో సీపీఐఎం మహాసభలు

నిజాంపేట్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దేశ రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ అన్నారు. శనివారం ప్రగతినగర్‌లో సీపీఐఎం జిల్లా 3వ మహాసభలు నిర్వహించారు. కార్యకర్తలు, నాయకులు ర్యాలీ నిర్వహించి, సీతారామ్ ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న దారిద్ర్యం, పెట్టుబడిదారి విధానాలకు నాయకులు పరిష్కారం చూపడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహారావు, సత్యం, రవి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న గొలుసును తిరిగిచ్చిన పోలీసులు

దుండిగల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ డీమార్ట్ వద్ద పోగొట్టుకున్న 15గ్రాముల బంగారు గొలుసును బాచుపల్లి పోలీసులు బాధితురాలికి క్షేమంగా తిరిగి అందించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాచుపల్లి మైత్రీ ప్రైడ్ అపార్టుమెంట్‌లోని ప్లాట్ నంబర్ 204లో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మేఘనా (24) 6న 9.30 గంటలకు సామాన్లు కొనుగోలు చేయడానికి నిజాంపేట్‌లోని డీమార్ట్‌కు చేరుకుంది. డీమార్టుకు రాగానే తన 15 గ్రాముల బంగారు గొలుసును పోగొట్టుకుంది.శనివారం బాచుపల్లి పోలీసులను బాధితురాలు ఆశ్రయించడంతో రంగంలోకి దిగిన పోలీసులు చైన్‌ను గుర్తించి బాధితురాలికి అప్పగించారు.



బాధితురాలికి గొలుసును అందిస్తున్న పోలీసులు



నిందితుడిని చూపుతున్న ఆర్పీఎఫ్ శక్తి టీం కానిస్టేబుళ్లు

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో 18 కిలోల గంజాయి పట్టివేత

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ వైపు వస్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో 18 కిలోల గంజాయితో పాటు వ్యక్తిని సికింద్రాబాద్ డివిజనల్ ఆర్పీఎఫ్ శక్తి టీం కానిస్టేబుళ్లు పట్టుకున్నారు. బేగంపేట్ ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నం నుంచి ముంబాయి వైపు వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ వ్యక్తి ఎస్-3 బోగిలో బెర్త్ నంబరు 71లో ప్రయాణం చేస్తున్నాడు. ఆ సమయంలోనే సికింద్రాబాద్ డివిజన్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ శక్తి టీం మహిళా కానిస్టేబుళ్లు డాలీ, రాధ, జ్యోతి, శీకార్‌లు శనివారం ఉదయం ఖమ్మం-ఖాజీపేట్ మార్గ మధ్యలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆకస్మిక తనిఖీ చేపట్టారు.

ఈ బోగిలో అనుమానంతో కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకోగా బెర్త్ కింద రూ 4.40 లక్షల విలువ చేసే 18 కిలోల గంజాయిని రెండు బ్యాగుల్లో ఉన్న 9 ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని హన్మకొండ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అప్పగించారు. ఈ ఏడాదిలో రూ. 4.18 కోట్ల విలువ చేసే గంజాయి సరుకును ఆర్పీఎఫ్ శక్తి టీం మహిళా కానిస్టేబుళ్ల బృందం పట్టుకుందన్నారు.



లియోషాకు కప్పును అందజేస్తున్న నిర్వాహకులు


గోల్డ్ మెడల్ సాధించిన బౌరంపేట విద్యార్థి

దుండిగల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో జరిగిన నేషనల్ మీట్ బ్యాడ్మింటన్ పోటీలలో బౌరంపేటకు చెందిన కోరుకొండ లియోషా పతకాన్ని గెలుచుకున్నాడు. ఇటీవల థానేలో జరిగిన 3వ మినీ యూ-11 జాతీయ 2024 పోటీలలో సింగిల్స్, డబుల్స్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. లియోషా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బౌరంపేటలో 4వ తరగతి చదువుతున్నాడు. సిక్కి, సుమిత్ బ్యాడ్మింటన్ అకాడమీలో కోచ్ సుమిత్‌రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ పొంది రెండున్నర సంవత్సరాలు కష్టపడి ఈ పతకాన్ని సాధించాడు. డీపీఎస్ ప్రిన్సిపల్ గౌరీ సర్కార్, ప్రొఫెసర్, వైస్ చైర్మన్ గోరంట్ల రమేష్, సిక్కిరెడ్డి, సుమిత్‌రెడ్డి, గోపిచంద్ క్రీడాకారుడిని అభినందించారు.

ప్రభుత్వ భూమి కబ్జా చేసి రోడ్డు నిర్మాణం

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి : బీజేపీ

దుండిగల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):దుండిగల్ మండలం దొమ్మర పోచంపల్లి గ్రామం సర్వే నంబర్ 120/6/2/పీలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం కోసం గత ప్రభుత్వంలో కలెక్టర్ ఎకరం స్థలాన్ని కేటాయించారు. దానికి అదనంగా 10 గుంటలు ఆక్రమించుకుని అందులో నుంచి రోడ్డు వేశారని బీజేపీ నాయకులు దుండిగల్ తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ జిల్లా కార్యాలయాల కోసం ప్రభుత్వం స్థలాలను కేటాయించడం జరిగిందన్నారు. డీపీపల్లి మెయిన్ రోడ్డును అనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని కేవలం రూ.40 లక్షలకే కాజేశారని ఆరోపించారు. వీటన్నింటిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులైన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ, జిల్లా పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల సతీష్, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

భగత్‌సింగ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో..

ఆటస్థలం కరువు

- 300 గజాల స్థలంలో రెండు పాఠశాలల నిర్వహణ
- వంటశాలలు, మూత్రశాలలు, అన్నీ అందులోనే

కుత్బుల్లాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌లో జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలున్నాయి. 300 గజాల స్థలంలో కింద ప్రాథమిక, పై అంతస్తులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ 350 మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. 13 మంది అధ్యాపకులు బోధిస్తున్నారు. 1992లో కాలనీ వ్యవస్థాపకులు వై.పెంచలరెడ్డి స్థానికంగా ఉండే పేదల పిల్లల కోసం దాతల సహకారంతో నిధులను సేకరించి భగత్‌సింగ్ మెమోరియల్ పబ్లిక్ స్కూల్‌కు 1995లో శంకుస్థాపన చేయించి ప్రారంభించారు. తదనంతరం స్కూల్‌ను ప్రభుత్వానికి అప్పగించడంతో ప్రాథమిక పాఠశాల, కొన్ని రోజుల తర్వాత జిల్లా పరిషత్ పాఠశాలలను అదే భవనంలో ప్రారంభించారు. గత ప్రభుత్వం మన ఊరు, మనబడి పథకం ద్వారా లక్షల రూపాయల నిధులు కేటాయించగా తూతూ మంత్రంగా కేవలం గదుల్లో ఫ్లోరింగ్ మాత్రమే చేశారని, రంగులు వేసి చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కేవలం 300 గజాల స్థలంలో కింద ఒక స్కూల్, పై అంతస్తులో మరో స్కూల్‌ను నిర్వహిస్తున్నారు. అందులోనే మూత్రశాలలు, వంటశాల, అధ్యాపకుల గదులకు ఉపయోగిస్తున్నారు. విద్యార్థులు ఆడుకునేందుకు స్కూల్ ముందున్న కొంత స్థలం మాత్రమే. క్రీడల్లో రాణించాలనుకునే విద్యార్థులకు ఏమాత్రం అవకాశంలేదు. సమీపంలోని పెంచలరెడ్డి విగ్రహం వద్ద ఖాళీ స్థలం ఉన్నా నిరుపయోగంగా మారింది. అందులో స్కూల్ భవనం కట్టించాలని, ఆడుకునేందుకు గ్రౌండ్ కూడా సరిపోతుందని స్థానికులు తెలుపుతున్నారు.



భగత్‌సింగ్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలు



స్కూల్ ముందున్న చిన్న స్థలంలో ఆటలు ఆడుతున్న చిన్నారులు



భగత్‌సింగ్‌నగర్‌లో నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలం ఇదే

కబడ్డీ అంటే ఇష్టం



కబడ్డీ, ఖోఖో అంటే ఎంతో ఇష్టం. కానీ మా పాఠశాల ఆవరణలో ఆడుకునేందుకు గ్రౌండ్ లేక ఆడలేకపోతున్నాను. గ్రౌండ్‌ను కేటాయిస్తూ క్రీడల్లో రాణిస్తాను. బడి ముందున్న చిన్న స్థలంలో బండలు వేయించారు. ఆటలు ఆడుతూ కింద పడితే గాయాలవుతున్నాయి.

- జయశ్రీ, 6వ తరగతి విద్యార్థిని

కొత్త భవనం నిర్మించాలి



ఒకటో తరగతి నుంచి ఇదే పాఠశాలలో చదువుతున్నాను. కబడ్డీలో రాణించాలనేది నా ఆశయం. కానీ గ్రౌండ్ లేక ఏమి చేయకపోతున్నాం. మా కాలనీలో ఉన్న ఖాళీస్థలంలో కొత్త భవనం కట్టిస్తే అక్కడున్న ఖాళీ గ్రౌండ్‌లో ఆటలు ఆడుకునేందుకు అవకాశముంటుంది.

- రోహిత్, 9వ తరగతి విద్యార్థి

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబ గొడవల కారణంగా పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రావడంలేదని భర్త రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం .. ఏదులాబాద్‌కు చెందిన భూతపాటి ఆదామ్(38) కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా భార్యభర్తల మధ్య గొడవల కారణంగా భార్య పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయి చాలా రోజులైంది. భార్యను చూసేందుకు వెళ్లి వచ్చినప్పటికి భార్య కాపురానికి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆదామ్ శనివారం బీబీనగర్-ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ మార్గ మధ్యలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతుడి జేబులో దొరికిన ఫోన్ నంబరు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని రైల్వే పోలీసులు తెలిపారు.

బ్యాడ్మింటన్ పోటీలు షురూ

హైదరాబాద్ (ఆంధ్ర జ్యోతి క్రీడాప్రతినిధి): గాడియం జాతీయ సబ్ జూనియర్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ శనివారం ప్రారంభించారు. ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా 750 మంది యువ క్రీడాకారులు అండర్-11, 13, 15 విభాగాల్లో పాల్గొననున్నారు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. పోటీల ప్రారంభోత్సవంలో గాడియం విద్యాసంస్థల చైర్మన్ నిత్యానంద రెడ్డి, సీతాఓట రామకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.